మనం
కడప | అన్నమయ్య

## నేడు మదనపల్లెకు సీఎం చంద్రబాబు రాక

### రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శంకుస్థాపన హాజరుకానున్న కేంద్ర ఆర్థిక మంత్రి

మనం ప్రతినిధి మదనపల్లె అక్టోబర్ 1: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు శుక్రవారం అన్నమయ్య జిల్లా మదనపల్లెలో పర్యటించనున్నారు. ఉదయం ఆయన గుంటూరు జిల్లా ఉండవల్లిలోని తన నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి ఉదయం 10:30 గంటలకు మదనపల్లె మండలం కొండమర్రిపల్లి వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ ప్రజాప్రతినిధులు, అధికారుల నుంచి స్వాగతం స్వీకరించిన అనంతరం, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రికి స్వాగతం పలుకుతారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ఉదయం 11:00 గంటలకు బి.కె.పల్లి గ్రామంలోని సభా ప్రాంగణానికి చేరుకుంటారు. ఈ పర్యటనలో భాగంగా 'రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్'తో పాటు 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్' నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం నిర్వహించే భారీ బహిరంగ సభలో పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 1:15గంటలకు సభా ప్రాంగణం నుంచి బయలుదేరి కొండమర్రిపల్లి హెలిప్యాడ్‌కు చేరుకొని, 1:35 గంటలకు హెలికాప్టర్‌లో తిరుగు ప్రయాణమవుతారు. ముఖ్యమంత్రి పర్యటన దృష్ట్యా జిల్లా అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు, పోలీసు బందోబస్తును కట్టుదిట్టం చేసింది.





## గ్రామీణ ప్రాంతాల సమగ్ర వికాసమే కూటమి ప్రభుత్వ ధ్యేయం: చమర్తి జగన్ మోహన్ రాజు



మనం న్యూస్ రాజంపేట అక్టోబర్ 1: ఎన్డీఏ కూటమి ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు స్పష్టం చేశారు. గురువారం రాజంపేట మండలం, పెద్ద కారంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని హస్తవరంలో నిర్వహించిన 'పల్లె పండుగ 3.0' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డీఎల్‌డీవో శంషాద్ భాను, కూటమి ముఖ్య నాయకులతో కలిసి ఆయన ఈ పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను స్వయంగా పరిశీలించిన ఆయన, స్థానిక ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ మరియు అభివృద్ధి ఫలాలు ప్రతి పల్లెకూ చేరేలా చర్యలు తీసుకుంటున్నామని, మౌలిక వసతుల కల్పన ద్వారా గ్రామాల రూపురేఖలు మార్చడమే లక్ష్యమని వెల్లడించారు. ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాలు ఆదర్శవంతంగా తీర్చిదిద్దబడతాయని, ప్రతి ఒక్కరూ అభివృద్ధి పనుల్లో భాగస్వాములు కావాలని చమర్తి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, ఎన్డీఏ కూటమికి చెందిన నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాయలసీమ రైతన్నకు కొత్త భరోసా ఉద్యాన రంగానికి గ్లోబల్ గమ్యం

### 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్ - రాయలసీమ రైజింగ్'ను విజయవంతం చేయాలని రైతులకు పిలుపు





ఓబులవారిపల్లి, అక్టోబర్ 01, మనం న్యూస్: తిరుపతి జిల్లా అభివృద్ధికి రూ.1,000 కోట్ల నిధులు మంజూరు కాగా, రైల్వే కోడూరు నియోజకవర్గ అభివృద్ధికి రూ.600 కోట్ల నిధులు మంజూరు కావడం నియోజకవర్గంపై ప్రభుత్వం చూపుతున్న ప్రత్యేక శ్రద్ధకు నిదర్శనమని ముక్కా రూపానంద రెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తెలిపారు. రాయలసీమ ప్రాంతాన్ని ప్రపంచస్థాయి ఉద్యాన పంటల కేంద్రంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో అక్టోబర్ 2న మదనపల్లిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ,కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా జరగనున్న 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్- రాయలసీమ రైజింగ్' శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైల్వే కోడూరు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి ,రైల్వే కోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ముక్కావారిపల్లె పంచాయతీ లో రైతులతో కలిసి వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముక్కా వరలక్ష్మి ,యువనేత ముక్కా సాయి వికాస్ రెడ్డి లతో పాటు ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు. ముక్కా రూపానంద రెడ్డి మాట్లాడుతూ రాయలసీమ అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతుల సంక్షేమం, ఉద్యాన పంటల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. తిరుపతి జిల్లా అభివృద్ధికి రూ.1,000 కోట్ల నిధులు



మంజూరు కాగా, రైల్వే కోడూరు నియోజకవర్గ అభివృద్ధికి రూ.600 కోట్ల నిధులు మంజూరు కావడం నియోజక వర్గంపై ప్రభుత్వం చూపుతున్న ప్రత్యేక శ్రద్ధకు నిదర్శనమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఈ నిధులతో అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మాట్లాడుతూ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ - రాయలసీమ రైజింగ్' ద్వారా రాయలసీమ రైతులకు ఆధునిక సాంకేతికత, మెరుగైన మార్కెట్ అవకాశాలు, విలువ ఆధారిత ఉత్పత్తులు, అంతర్జాతీయ మార్కెట్లకు చేరువయ్యే అవకాశాలు లభించే దిశగా కీలక మార్పులకు బాటలు పడనున్నాయని అన్నారు. ఉద్యాన పంటల సాగుతో పాటు రైతుల ఆదాయాన్ని పెంచే అవకాశాలను ఈ ప్రాజెక్టు మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు. అక్టోబర్ 2న మదనపల్లిలో జరగనున్న శంకుస్థాపన కార్యక్రమానికి రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నాయకులు కోరారు.

## గ్రామాల ప్రగతికి బాటలు.. స్థానిక అవసరాలే ప్రాధాన్యం

### కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



మనం ప్రతినిధి కడప అక్టోబర్ 1: పల్లెల సమగ్ర వికాసానికి స్థానిక ప్రజల భాగస్వామ్యమే కీలకమని, ప్రజల అవసరాలు, ప్రాధాన్యతలను గుర్తించి వాటికి అనుగుణంగానే గ్రామ అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని వైఎస్సార్ కడప జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి స్పష్టం చేశారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని గురువారం (అక్టోబర్ 2న) జిల్లావ్యాప్తంగా ఉన్న 629 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 2027-28 ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే పనులను ఈ సభల ద్వారా క్షేత్రస్థాయిలోనే గుర్తించి తుది నివేదికలు సిద్ధం చేస్తామన్నారు. గ్రామ సభల్లో ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ కూలీలు పెద్దఎత్తున పాల్గొని తమ గ్రామాలకు నిజమైన ప్రయోజనం చేకూర్చే పనులను నిర్భయంగా ప్రతిపాదించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. గ్రామాల ముఖచిత్రాన్ని మార్చే విధంగా నీటి భద్రత, గ్రామీణ మౌలిక వసతులు, ఉపాధి అవకాశాల పెంపుదల, ప్రకృతి విపత్తుల నివారణ వంటి నాలుగు ప్రధాన రంగాల్లో దాదాపు 375 రకాల పనులను చేపట్టేందుకు వీలుందని వెల్లడించారు. నీటి నిల్వ గుంతలు, చెరువుల పునరుద్ధరణ, కొండవాలు కందకాలు, పుష్ప-పండ్ల తోటల పెంపకం, పశువుల కొట్టాలు, సీసీ రోడ్లు, పంచాయతీ కార్యాలయాలు, వైకుంఠ ధామాలు, శీతల గిడ్డంగులు వంటి ప్రజోపయోగ పనులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. గ్రామ సభల్లో గుర్తించిన ప్రతి పనికీ యుద్ధప్రాతిపదికన సాంకేతిక వివరాలు పూర్తి చేసి, ప్రభుత్వ నిబంధనలకు లోబడి పనుల మంజూరుకు సత్వరమే ప్రతిపాదనలు పంపాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు.

## పచ్చని చేలపై కన్నీటి నాగలి!

### ఉత్తర కాలువకు సాగునీరివ్వని అధికారులు

### చుక్క నీరు లేక ఎండిన మిరప పంట

### తట్టుకోలేక 15 ఎకరాల్లో ట్రాక్టర్లతో దున్నివేత

### పరిశ్రమలకే ప్రాధాన్యమా?.. రైతన్నల నిలదీత



మనం ప్రతినిధి కడప, అక్టోబర్ 1 : వర్షాలు కురుస్తాయని ఆశపడ్డారు.. జలాశయంలో నీళ్లు ఉన్నాయని ధైర్యంగా మిరప నారు నాటారు. రెక్కలు ముక్కలు చేసుకుని, లక్షల రూపాయలు అప్పులు తెచ్చి కంటికి రెప్పలా కాపాడుకున్నారు. తీరా చేతికొచ్చే దశలో అధికారులు చుక్క నీరు కూడా వదలకుండా ముఖం చాటేశారు. నెల రోజులుగా నీరందక కళ్లముందే పంట ఎండిపోతుంటే గుండెలు పగిలిన రైతన్నలు.. చేసేది లేక ట్రాక్టర్లతో పచ్చని పైరును నేలమట్టం చేశారు. మండల పరిధిలోని తొర్రివేముల గ్రామంలో గురువారం చోటుచేసుకున్న ఈ విషాద దృశ్యం స్థానిక అన్నదాతలను తీవ్ర ఆవేదనకు గురిచేసింది.

**కన్నీరవుతున్న తొర్రివేముల రైతులు..**

మైలవరం మండలంలోని తొర్రివేములలో రైతులు భారీ ఎత్తున మిరప సాగు చేశారు. అయితే పంట ఎదుగుదల దశలో సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెల రోజులు గడుస్తున్నా ఉత్తర కాలువకు బొట్టు నీరు కూడా విడుదల చేయలేదు. పంటను కాపాడుకునే మార్గం లేక, నెర్రెలు బారిన నేలలో పైరు మాడిపోతుండటంతో రైతులు సుమారు 15 ఎకరాల్లో సాగు చేసిన మిరప తోటలను ట్రాక్టర్లతో దున్నేశారు. పెట్టుబడులు సైతం దక్కక తీవ్ర నష్టాలపాలయ్యామని రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు.

**పరిశ్రమలకేనా ప్రాధాన్యం?**

మైలవరం జలాశయంలో ప్రస్తుతం 1.47 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది. అయితే ఆ నీటిని కేవలం తాగునీటి అవసరాలు, పరిశ్రమల కోసమే వినియోగిస్తున్నామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. పంటలు ఎండిపోయి రైతులు అప్పులపాలవుతుంటే పట్టించుకోని అధికార యంత్రాంగం.. పరిశ్రమలకు మాత్రం యథేచ్ఛగా నీరివ్వడంపై రైతాంగం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

**తక్షణమే సాగునీరు విడుదల చేయాలి:**

ఉత్తర కాలువ పరిధిలో ఇంకా మిగిలి ఉన్న పంటలనైనా బతికించేందుకు అధికారులు వెంటనే సాగునీటిని విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. నీరందక పంట కోల్పోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే పరిహారం అందించి ఆదుకోవాలని, నిర్లక్ష్యం వీడకపోతే ఉద్యమిస్తామని అన్నదాతలు హెచ్చరిస్తున్నారు



## యముడి వేషధారణలో ట్రాఫిక్ నియమాలపై అవగాహన

### నిబంధనలు పాటిస్తేనే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యం

ముద్దనూరు, అక్టోబర్,1,మనం న్యూస్: జిల్లా ఎస్పీ నచ్చికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు గురువారం సిఐ నగేష్ బాబు రోడ్డు భద్రత నియమాలలో భాగంగా హెల్మెట్ ధరించండి ప్రాణాలను రక్షించుకోండి అనే నినాదంతో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు యముడి వేషధారణలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు ట్రాఫిక్ నియమాలు, రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. సిఐ నగేష్ బాబు మాట్లాడుతూ అమ్మ పునర్జన్మనిస్తే ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించడం వలన అనుకొని ప్రమాదం చోటు చేసుకున్నప్పుడు మరో జన్మనిస్తుందని పేర్కొన్నారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం, సీటు బెల్టు ధరించకుండా కార్లు నడపడం, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చర్యల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వివరించారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. యముడి వేషధారణ ద్వారా ప్రమాదాల వల్ల ప్రాణాలు కోల్పోయే పరిస్థితులను వినూత్నంగా వివరిస్తూ వాహనదారుల్లో అవగాహన కల్పించారు. రోడ్డు మీద ప్రయాణించే ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో యముడు వేషధారణలో రిటైర్డ్ లక్షల డాక్టర్ పుల్లారెడ్డి, చిత్రగుప్తుని వేషధారణలో వెంకట నాగిరెడ్డి, పాల్గొన్నారు.

## జూదరుల అరెస్ట్

### జూదం ఆడుతూ పట్టుబడితే కఠిన చర్యలు తప్పవు



ముద్దనూరు,అక్టోబర్ 1 మనంన్యూస్: మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీ సమీపంలో జూదం ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు సీఐ నగేష్ బాబు తోటి సిబ్బందితో దాడి నిర్వహించి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 52 పేక ముక్కలు 5500 నగదు స్వాధీనపరచుకొని కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎవరైనా జూదం వంటి ఆ సంగటిత కార్యక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా హెచ్చరించారు.

## మాధవరం-1లో ఘనంగా అంగన్వాడీ ఉత్సవం



సిద్దవటం, అక్టోబర్ 01 మనం న్యూస్ : సిద్దవటం మండలం మాధవరం-1 అంగన్వాడీ కేంద్రంలో గురువారం అంగన్వాడీ ఉత్సవాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీవిద్య ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్త సుబ్బలక్షుమ్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలు, పౌష్టికాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్త సుబ్బలక్షుమ్మ మాట్లాడుతూ..చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు అంగన్వాడీ కేంద్రాలు ఎంతో దోహదపడుతున్నాయని తెలిపారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు వారి ఆరోగ్యం, విద్య, ఎదుగుదలపై అంగన్వాడీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లల ఆరోగ్యం, పరిశుభ్రత విషయంలో తల్లిదండ్రులు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ సహాయకురాలు శశికళతో పాటు చిన్నారుల తల్లిదండ్రులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

## సీఎం సభకు రెండు బస్సులు ఏర్పాటు

### తాసిల్దార్ విజయ్‌కుమార్

సిద్ధవటం, అక్టోబర్ 1 మనం న్యూస్ : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనలో భాగంగా,2 బస్సులు ఏర్పాటు చేశామని సిద్ధవటం మండల తాసిల్దార్ విజయ్ కుమార్ తెలిపారు మండల కేంద్రమైన సిద్ధవటం లోని తన కార్యాలయంలో ఆయన గురువారం మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మదనపల్లిలో శుక్రవారం, గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కార్యక్రమంలో పాల్గొంటారని కావున రైతులు ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వియం చేసుకోవాలని తెలిపారు, సిద్ధవటం, మాధవరం గ్రామాల నుండి ఉదయం 4గంటలకు బస్సులు బయలుదేరుతాయని తెలిపారు ఆసక్తి గల రైతులు సీఎం ప్రోగ్రాం కు తరలి వెళ్లాలన్నారు

# ఎల్‌నినో పరిస్థితుల్లో 95 ఎకరాల్లో 30 రకాల విత్తనాలతో పీఎండీఎస్ అమలు

### ప్రకృతి వ్యవసాయానికి పీఎండీఎస్‌తో బాటలు - పంటలతో పాటు పశుగ్రాసానికి ప్రయోజనం

రైల్వే కోడూరు, అక్టోబర్ 01, మనం న్యూస్: తిరుపతి జిల్లా, రైల్వే కోడూరు లో ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రకృతి వ్యవసాయ విధానాలను ప్రోత్సహించే దిశగా రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో కోడూరు మండలం, కే. బుడుగుంటపల్లి గ్రామంలో పీఎండీఎస్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైల్వే కోడూరు నియోజకవర్గ టీడీపీ పార్టీ ఇన్‌చార్జ్, కూడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి వ్యవసాయ భూమిలో మొదటిగా 30 రకాల పంటల విత్తనాలను పీఎండీఎస్ విధానంలో చల్లడం జరిగింది. ఎకరాకు సుమారు 10 కిలోల చొప్పున విత్తనాలతో కూడిన 100 పీఎండీఎస్ కిట్లను వినియోగించి విత్తనాలను భూమిలో చల్లారు.



వివిధ రకాల పంటల విత్తనాలను కలిపి చల్లడం ద్వారా భూమిపై పంటల వైవిధ్యాన్ని పెంపొందించడంతో పాటు, భూమిని ఎక్కువ కాలం పచ్చదనంతో కప్పి ఉంచేందుకు అవకాశం ఉంటుంది. ఈ విధానం నేలలో తేమను నిలుపుకోవడం, నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, జీవ వైవిధ్యాన్ని పెంపొందించడం మరియు భూమిని సారవంతంగా ఉంచేందుకు దోహదపడుతుందని అధికారులు తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో భూమిని పచ్చదనంతో కప్పి ఉంచడం, పంటల వైవిధ్యాన్ని పెంచడం, నేల జీవక్రియను ప్రోత్సహించడం మరియు స్థానిక వనరులను సమర్థవంతంగా వినియోగించడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఉంటుంది. ఈ నేపథ్యంలో పీఎండీఎస్ విధానం ప్రకృతి వ్యవసాయ లక్ష్యాలకు అనుగుణంగా భూమిని నిరంతరం పంటల కవరేజీలో ఉంచేందుకు ఉపయోగపడుతుందని అధికారులు వివరించారు. ఎల్‌నినో పరిస్థితుల్లో వర్షపాతం లోపించిన సమయంలో నేలలో తేమను సంరక్షించడం, భూమిపై పచ్చదనాన్ని కొనసాగించడం మరియు నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం వంటి అంశాలకు పీఎండీఎస్ ఉపయోగపడుతుందని తెలిపారు. 365 రోజుల పాటు భూమిపై వివిధ రకాల పంటల కవరేజీ ఉండేలా చర్యలు తీసుకోవడం ద్వారా భూమిని జీవంతో ఉంచేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

**పంటలతో పాటు పశుగ్రాసానికి కూడా ప్రయోజనం**

పీఎండీఎస్ ద్వారా పెరిగే వివిధ రకాల పంటల పచ్చదనం, పశుగ్రాసాన్ని వారి ఆధ్వర్యంలోని గోశాలలో ఉన్న ఆవులకు పశుగ్రాసంగా వినియోగించుకునే అవకాశం ఉంటుంది. తద్వారా పీఎండీఎస్ ద్వారా భూమికి పచ్చదనం, నేలకు తేమ మరియు సారవంతం లభించడంతో పాటు, పశువులకు అవసరమైన పచ్చి పశు గ్రాసం కూడా అందుబాటులోకి వస్తుంది. పంటలు-పశువుల సమన్వయం ప్రకృతి వ్యవసాయంలో కీలకమైన అంశం కాగా, ఈ విధానం ద్వారా వ్యవసాయ భూమి నుంచి లభించే వనరులను తిరిగి వ్యవసాయ వ్యవస్థలోనే వినియోగించుకునే అవకాశం ఉంటుంది. ఎల్‌నినో వంటి పరిస్థితుల్లో స్థానికంగా లభించే పశుగ్రాస వనరులను వినియోగించుకోవడం గోశాలలోని పశువుల పోషణకు కూడా ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు తెలిపారు. టిడిపి ఇన్చార్జ్ ముక్కా రూపానంద రెడ్డి భూమి లో మొదటి గా పీఎండీఎస్ విధానాన్ని అమలు చేయడం ద్వారా గ్రామంలోని ఇతర రైతులకు కూడా ప్రకృతి వ్యవసాయం, పంటల వైవిధ్యం మరియు భూమిని పచ్చదనంతో కప్పి ఉంచడం వంటి అంశాలపై అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నారని అధికారులు పేర్కొన్నారు. గ్రామంలోని రైతులు కూడా ఖాళీగా ఉన్న మరియు బీడు భూములను పీఎండీఎస్ విధానంలోకి తీసుకువచ్చి భూమిని పచ్చదనంతో కప్పి ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ అధికారులు, సిబ్బంది మరియు సంబంధిత సిబ్బంది పాల్గొని ప్రకృతి వ్యవసాయం, పీఎండీఎస్ విధానం, విత్తనాల చల్లింపు పద్ధతి, నేల తేమ సంరక్షణ, పంటల వైవిధ్యం, పశుగ్రాస వినియోగం మరియు ఎల్‌నినో పరిస్థితుల్లో పీఎండీఎస్ ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.

# ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

ఒంటిమిట్ట, అక్టోబరు 1 మనం న్యూస్
ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో ఒంటిమిట్ట మండల స్థాయి క్రీడా ఎంపికలు గురువారం కొత్త మాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉత్సాహంగా జరిగాయి. అండర్-14, అండర్-17 బాలబాలికలకు కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా తదితర క్రీడల్లో పోటీలు నిర్వహించారు. కబడ్డీ అండర్-17 బాలుర విభాగంలో రాచపల్లి జడ్పీహెచ్ఎస్ విజేతగా, మాధవరం జడ్పీహెచ్ఎస్ రన్నరప్‌గా నిలిచాయి. బాలికల విభాగంలో చింతరాజుపల్లి జడ్పీహెచ్ఎస్ విజేతగా, రాచపల్లి జడ్పీహెచ్ఎస్ రన్నరప్‌గా నిలిచింది. అండర్-14 బాలురలో మాధవరం విజేతగా, చింతరాజుపల్లి రన్నరప్‌గా, బాలికలలో చింతరాజుపల్లి విజేతగా, మాధవరం రన్నరప్‌గా నిలిచాయి. వాలీబాల్ అండర్-17 బాలురలో రాచపల్లి జడ్పీహెచ్ఎస్ విజేతగా, ఒంటిమిట్ట జడ్పీహెచ్ఎస్ రన్నరప్‌గా నిలిచింది. అండర్-14 బాలురలో రాచపల్లి విజేతగా, ఒంటిమిట్ట రన్నరప్‌గా నిలిచాయి. బ్యాడ్మింటన్ అండర్-17 బాలుర, బాలికల విభాగాల్లో మాధవరం జడ్పీహెచ్ఎస్ విజేతగా నిలవగా, చింతరాజుపల్లి రన్నరప్‌గా నిలిచింది. అండర్-14 బాలుర, బాలికల విభాగాల్లో చింతరాజుపల్లి విజేతగా, మాధవరం రన్నరప్‌గా నిలిచాయి. చెస్ అండర్-17 బాలురలో



మాధవరం జడ్పీహెచ్ఎస్‌కు చెందిన కె. కార్తీక్ మొదటి స్థానం, చింతరాజుపల్లికి చెందిన డి.పి. ప్రవీణ్ రెండో స్థానం సాధించారు.

బాలికల్లో మాధవరం పాఠశాలకు చెందిన జి. కావేరి మొదటి స్థానం, చింతరాజుపల్లికి చెందిన ఎ. యోగిత రెండో స్థానం పొందారు. అండర్-14 బాలురలో జి. లోహిత్ (మంటపం పల్లి ), ఎ. హరిచంద్రప్రసాద్ (మాధవరం), బాలికల్లో సి. నందిని (మాధవరం), ఎస్. ప్రణీత (చింతరాజుపల్లి) వరుసగా తొలి రెండు స్థానాల్లో నిలిచారు. యోగా అండర్-17 బాలురలో ఎ. మాధవ (మాధవరం), ఆర్. వినోద్ (చింతరాజుపల్లి), బాలికల్లో బి. హరిణి (మాధవరం), జి. వైష్ణవి (మంటపం పల్లి ) ప్రతిభ కనబరిచారు. అండర్-14 బాలురలో జి. యశ్వంత్ (మంటపం పల్లి ), లిఖిత్ (చింతరాజుపల్లి), బాలికల్లో ఎస్. హేమశ్రీ (మాధవరం), ఎన్. చందుషా (రాచపల్లి) తొలి రెండు స్థానాలు సాధించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అధికారులు అభినందించారు. మండల క్రీడా సమన్వయకర్త వెంకటసుబ్బయ్య, ఎంఈఓలు వీరశేఖర్, డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంబేద్కర్ పర్యవేక్షణలో ఎంపికలు నిర్వహించారు.

# ఆకాశంలో అద్భుతం.. డ్రోన్ వెలుగుల్లో 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్'!





మనం ప్రతినిధి మదనపల్లి, అక్టోబర్ 1
మదనపల్లి నింగిలో సాంకేతిక కాంతులు విరజిమ్మాయి. రాయలసీమను ప్రపంచ స్థాయి ఉద్యాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేపట్టిన 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్ -రాయలసీమ రైజింగ్' కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ ఎన్వీఆర్ లేఅవుట్‌లోని మున్సిపల్ పార్కులో నిర్వహించిన డ్రోన్ ఎల్ఈడీ/లేజర్ షో స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. వందలాది డ్రోన్లు మిరుమిట్లు గొలిపే వెలుగులతో ఆకాశంలో లయబద్ధంగా కదులుతూ వ్యవసాయ పురోగతిని, ఆధునిక సాగు పద్ధతులను, ఉద్యాన పంటల వైభవాన్ని అద్భుత దృశ్యాలుగా ఆవిష్కరించాయి. ఈ ప్రదర్శనను స్థానిక శాసనసభ్యులు

### ముగ్ధులైన మదనపల్లి ప్రజలు, ఎమ్మెల్యే షాజహాన్ భాష

షాజహాన్ భాష, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు ఎం. వెంకటేశ్వర ప్రసాద్ తదితరులు ఆసక్తిగా వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అత్యాధునిక డ్రోన్ విన్యాసాల ద్వారా గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాధాన్యతను ప్రజల్లోకి తీసుకెళ్లడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో మదనపల్లి ప్రాంతాన్ని అంతర్జాతీయ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని, ఈ ప్రాజెక్టు ద్వారా స్థానిక రైతులకు అంతర్జాతీయ మార్కెటింగ్, యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. చీకటిని చీల్చుకుంటూ డ్రోన్లు సృష్టించిన ఆహ్లాదకరమైన ఆకృతులు, 'రాయలసీమ రైజింగ్' సందేశాలు పిల్లలు, యువతతో పాటు హాజరైన వేలాది మంది ప్రజలను మంత్రముగ్ధులను చేశాయి. మదనపల్లి భవిష్యత్ ప్రగతిని కళ్లకు కట్టిన ఈ డ్రోన్ షో ఆద్యంతం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. కార్యక్రమంలో సమాచార శాఖ ఏడీ పురుషోత్తం, ఏపీఆర్వో హరినాథ్ నాయక్, ఎన్వీఆర్ లేఅవుట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుధాకర్, స్థానిక ప్రముఖులు, అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సర్వాంగ సుందరంగా సభా వేదిక

## నేడు మదనపల్లెలో ఉద్యాన సదస్సు.. సిద్ధమైన భారీ డయాస్




మనం ప్రతినిధి మదనపల్లె, అక్టోబర్ 1: 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్ – రాయలసీమ రైజింగ్' కార్యక్రమం కోసం మదనపల్లెలో సభా వేదిక అద్భుతంగా ముస్తాబైంది. నేడు శుక్రవారం జరిగే సదస్సుకు ముఖ్యమంత్రి, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహా మంత్రులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరుకానుండటంతో అందుకు తగినట్లుగా భారీ వేదికను తీర్చిదిద్దారు. వేదికపై ప్రముఖుల ఆసీనులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు, సభా ప్రాంగణంలోని రైతులకు వీక్షించేందుకు అనువుగా అత్యాధునిక ఎల్ఈడీ తెరలు, పటిష్ఠమైన సౌండ్ సిస్టమ్‌ను అమర్చారు. కలెక్టర్ నిశాంత్ కుమార్ పర్యవేక్షణలో గురువారం రాత్రి పొద్దుపోయే వరకు వేదిక అలంకరణ, మైక్ టెస్టింగ్, విద్యుద్దీపాల పనులను అధికారులు వేగంగా పూర్తి చేశారు. పది జిల్లాల నుంచి తరలివచ్చే అన్నదాతలు సభను స్పష్టంగా తిలకించేలా గ్యాలరీలతో పాటు వేదికను సర్వాంగ సుందరంగా సిద్ధం చేశారు.

# నిరుపేదల ఆర్థిక అభివృద్దే కూటమి ప్రభుత్వ లక్ష్యం :ఎమ్మెల్యే




పెనగలూరు(అక్టోబర్ 01),మనంన్యూస్:

రాష్ట్రంలో నిరుపేదల ఆర్థిక అభివృద్దే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రైల్వే కోడూర్ శాసనసభ్యులు అరవ శ్రీధర్, టిడిపి యువ నాయకుడు ముక్కా సాయి వికాస్ రెడ్డి, రైల్వేకోడూరు నియోజకవర్గం స్పెషల్ ఆఫీసర్, డీఆర్డీఏ పీడీ శోభన్ బాబు తెలిపారు. గురువారం పెనగలూరు మండలం ఓబిలి పంచాయతీ కార్యాలయంలో " పేదల సేవలో " 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించారు. పేద ప్రజలు ఆర్థికం అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పింఛన్ లబ్ధిదారులకు వారి పింఛన్ డబ్బులు అందించారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుమని, ఎంపీడివో మోహన్, డిప్యూటీ ఎంపీడివో శ్రీకాంత్, ఎంఈవో లు నాగ సుబ్బరాయుడు, గిరి వరదయ్య, ఏవో పవన్ కుమార్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ విజయ కుమారి, పీడివో దామోదర్, వీఆర్వో నరసింహులు, టీడీపీ నాయకులు మాడపూరి శ్రీనివాసులు, హాబిబుల్లా, అమిరుల్లా, కరీముల్లా, దాసరి దామోదర్ నాయుడు, మాజీ టీడీపీ మండల అధ్యక్షులు కొత్త బాలకృష్ణ, చక్రంపేట సురేష్ రెడ్డి, కళా చంద్ర, సుదర్శన్, మారంరెడ్డి శివయ్య, మదన్, కట్టావారిపల్లి మాజీ ఎంపిటిసి కస్తూరి శ్రీనివాసులు నాయుడు, శింగనమల నరేష్, వెంకటేష్ నాయుడు, రెడ్డివారిపల్లి హరి, జనసేన నాయకులు గోబ్బూరి హరి, సాయి, ఉగ్ర నరసింహ, ప్రదీప్ పాల్గొన్నారు.

# కాలి గాయం కన్నా మనసు గాయమే గెలిచింది!

## పరుగు పందెంలో పాల్గొనలేక తొమ్మిదో తరగతి విద్యార్థి తనువు చాలించిన విషాదం

మనం ప్రతినిధి కడప అక్టోబర్ 1:
చిన్నారి మనసు ఎంత సున్నితంగా ఉంటుందో, నిరాశ ఎదురైనప్పుడు ఆ హృదయం ఎంతలా కుంగిపోతుందో చెప్పేందుకు ఈ హృదయ విదారక ఘటనే నిదర్శనం. ఆశించిన పరుగు పందెంలో పాల్గొనే అవకాశం చేజారిందన్న బాధను భరించలేక ఓ తొమ్మిదో తరగతి బాలుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రామేశ్వరంలోని స్థానిక పురపాలక పాఠశాలలో చదువుతున్న ఆ బాలుడు చదువుతో పాటు ఆటపాటల్లోనూ చురుగ్గా ఉండేవాడు. స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో పాల్గొని తన ప్రతిభను చాటాలని ఎన్నో కలలు కన్నాడు. రన్నింగ్ రేసులో పతకం సాధించాలన్న తపనతో కొద్ది రోజులుగా తీవ్ర సాధన కూడా చేశాడు. తీరా పోటీల సమయానికి కాలికి గాయం కావడంతో నిబంధనల ప్రకారం అతడు మైదానంలోకి దిగే అవకాశం కోల్పోయాడు.

చేతిదాకా వచ్చిన అవకాశం చేజారిపోవడాన్ని ఆ బాలుడు జీర్ణించుకోలేకపోయాడు. కాలి గాయం కన్నా, ఆడలేకపోయానన్న ఆవేదన ఆ పసి మనసును తీవ్రంగా వెంటాడింది. ఆ నిరాశ, క్షణికావేశంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు. కొడుకు ఉన్నత శిఖరాలకు చేరుకుంటాడని ఆశపడ్డ తల్లిదండ్రులకు ఈ ఘటన తీరని శోకాన్ని మిగిల్చింది. తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు విషాదంలో మునిగిపోయారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. బాలుడి పూర్తి వివరాలు, ఈ సంఘటన వెనుక ఉన్న ఇతర కారణాలు తెలియాల్సి ఉంది.

# రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 క్రికెట్‌కు చిట్వేలీ విద్యార్థినులు ఎంపిక



చిట్వేలీ అక్టోబర్ 1 మనం న్యూస్: ఎస్‌జీఎఫ్ అండర్-19 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు చిట్వేలీ పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు పసుపుల కుసుమిత, నయనాల గ్రీష్మిత సాయి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు మాట్లాడుతూ గురువారం రైల్వేకోడూరులోని సాయి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఎస్.జి.ఎఫ్ అండర్ 19 క్రికెట్ ఎంపికల్లో ఉమ్మడి కడప జిల్లా జట్టుకు వీరు ఎంపిక కావడం జరిగిందన్నారు. విద్యార్థినుల ప్రతిభను అభినందిస్తూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు, సీనియర్ ఉపాధ్యాయులు సోఫియా, ఎన్‌సీసీ అధికారి పసుపుల రాజశేఖర్ అభినందనలు తెలిపారు. విద్యార్థినులకు శిక్షణ అందించిన పీడీ రమాదేవిని వారు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



## అక్టోబర్ 10, 11 తేదీల్లో అంగన్‌వాడీ తిరుపతి జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని సీఐటీయూ పిలుపు

### చిన్నఓరంపాడులో వాల్‌పోస్టర్లు, కరపత్రాల విడుదల

ఓబులవారిపల్లి, అక్టోబర్ 01, మనం న్యూస్: అంగన్‌వాడీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సుదీర్ఘ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అక్టోబర్ 10, 11 తేదీల్లో సూళ్లూరుపేటలో నిర్వహించనున్న అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) తిరుపతి జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం ఓబులవారిపల్లి మండలం చిన్నవరంపాడు పంచాయతీ పరిధిలో సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ నాయకులు సీహెచ్ చంద్రశేఖర్ కోడూరు ప్రాజెక్ట్ అధ్యక్షురాలు ఎన్. రమాదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాధాకుమారి ల ఆధ్వర్యంలో మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. సూళ్లూరుపేటలో జరిగే ఈ జిల్లా మహాసభలకు సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె. సుబ్బరావమ్మ, రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి లు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరుకానున్నారని నాయకులు తెలిపారు. కావున తిరుపతి జిల్లా పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకురాలు స్వర్ణలత, వాణి, శంకరమ్మ, వరలక్ష్మి, అంజనమ్మ, సునీతతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్ పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు

### 49 కిలోల కాపర్ వైర్, మోటార్‌సైకిల్, ఆటో స్వాధీనం.



ముద్దనూరు అక్టోబర్ 1 మనం న్యూస్: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్‌ను చోరీ చేస్తున్న ముఠాకు చెందిన నలుగురిని ముద్దనూరు పోలీసులు గురువారం చెన్నారెడ్డి పల్లె గ్రామ సమీపంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద గురువారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో, పోలీసులను గమనించి పారిపోయేందుకు ప్రయత్నించిన నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సిఐ నగేష్ బాబు తెలిపారు. ఈ నలుగురిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా ముద్దనూరు, ఖాజీపేట, తలమంచిపట్నం పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్ దొంగతనాలకు పాల్పడినట్లు పేర్కొన్నారు.
అదుపులోకి తీసుకున్న వారిలో పోలా రమేష్ (20), వడ్డే ప్రశాంత్ (21), జగన్నాథం, సుబ్రహ్మణ్యం (23),16 సంవత్సరం గల బాలుడుని అదుపులోకి తీసుకున్నాట్లు వివరించారు. వీరి వద్ద నుంచి వివిధ కేసులకు సంబంధించిన 49 కిలోల కాపర్ వైర్ ఒక మోటార్‌సైకిల్ ఒక మహీంద్రా ఆటో ను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. 16 ఏళ్ల నాగేంద్రను బాలుడిగా పరిగణించి, జువెనైల్ జస్టిస్ చట్టం, ఇతర వర్తించే చట్ట నిబంధనల ప్రకారం చర్యలు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

## దేవుని కడప విమాన గోపురానికి స్వర్ణకవచం ఏర్పాటు చేయాలి

కడప అక్టోబర్ 01(మనం న్యూస్)
దేవుని కడప విమాన గోపురానికి స్వర్ణకవచం ఏర్పాటు చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానములు కార్యనిర్వహణాధికారికి సుముఖీ ఎండోమెంట్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు విద్వాన్ నాగదాసరి మునికుమార్ డిజిటల్ వినతిపత్రంను సమర్పించారు. తిరుమల తొలిగడప దేవుని కడప శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి శ్రీ పద్మావతి అమ్మవారు శ్రీ ఆండాల అమ్మవారి ఆలయాల విమాన గోపురాలకు స్వర్ణ కవచ సమర్పణం తిరుమల తిరుపతి దేవస్థానములవారు చేయాలని తెలుపుతూ సంబంధిత ప్రస్తుత విమాన గోపుర శిఖర చిత్రాలు మరియు స్వర్ణ కవచం ఏర్పాటు చేస్తే ఆలయం ఎలా ఉంటుందో చూపించే నమూనా చిత్రాలను లేఖలో జతపరచడం జరిగింది.

